క్లుప్తంగా

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ట్రస్ట్ ఆధ్వర్యాన నిరుపేద, హెచ్ఐవీ బాధిత విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులను అభినందించారు. అనంతరం జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారిగా జిల్లాలో ఏడేళ్లు పనిచేసి బదిలీ అయిన డాక్టర్ జూపూడి ఉషారాణిని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, పాత ప్రభుత్వాసుపత్రి సేఫ్ సెంటర్ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ ఛైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి, వైస్‌ఛైర్మన్ ఎస్‌కే షఫీవుల్లా, ట్రస్ట్ సభ్యులు గుర్రం ఏడుకొండలు, విశ్వేశ్వరరావు, సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వీర్నాల గౌతం అంబేడ్కర్, కౌన్సిలర్ వరప్రసాద్, భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌పై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

విజయవాడస్పోర్ట్స్: ఏపీయూడబ్ల్యూజే యూనియన్, బెజవాడ ప్రెస్ క్లబ్‌పై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.జి.వి.సరితను ఏపీయుడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. డీసీపీని కలిసిన వారిలో యూనియన్ అర్బన్ అధ్యక్షుడు చావా రవి, కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి డి. నాగరాజు, యూనియన్ సీనియర్ నాయకులు ఎస్.కె.బాబు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.రమణారెడ్డి, సామ్నా నగర అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారావు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకుడు సాంబశివరావు, ఏపీయూడబ్ల్యూజే కౌన్సిల్ సభ్యులు రఘు, కోశాధికారి హుస్సేన్, కార్యవర్గ సభ్యులు కుమార్, తిరుమలరావు, ఖదీర్ ఉన్నారు.

మధురానగర్‌లో చోరీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులోని ఓ ఇంట్లో ఎవరూలేని సమయంలో తాళం పగులకొట్టి సుమారు 30 కాసుల బంగారు ఆభరణాలు, రూ. 50వేలు నగదు చోరీ చేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డుకు చెందిన బాలజ్యోతి శుక్రవారం ఇంటికి తాళం వేసి సోదరి ఇంటికి వెళ్లారు. శనివారం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులకొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 30 కాసుల బంగారు ఆభరణాలు, రూ. 50వేల నగదు కనిపించలేదు. కేవలం బీరువాలోని లాకర్‌లోని వస్తువులను మాత్రమే దొంగిలించడం ఇంట్లోని ఏ వస్తువులను ముట్టుకోకపోవడం చూస్తుంటే తెలిసిన వారి పని అయ్యి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

సమన్వయంతో కలిసి ముందుకు సాగుదాం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని ఆలయ ఈఓ శీనానాయక్ తెలిపారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో పని చేస్తున్న అన్ని విభాగాల అధికారులు, ఆలయ అర్చకులు, ఎస్ఎంఆర్, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో శనివారం ఆయన సమావేశమయ్యారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ సిబ్బందితో ఈఓ చర్చించారు. ఉద్యోగులందరూ అమ్మవారి సైన్యంలా పని చేయాలని, ఏ విషయం ఉన్నా నేరుగా తన వద్దకు వచ్చి సమస్యను వివరించవచ్చునని పేర్కొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ప్రధాన అర్చకులు మల్లేశ్వరశాస్త్రి, ఈఈ కోటేశ్వరరావు, ఏఈవోలు ఎన్. రమేష్‌బాబు, వెంకటరెడ్డి, తిరుమలేశ్వరరావు, అర్చకులు, వేద పండితులు అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో స్వచ్ఛాంధ్ర

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద ఆలయ ఈఓ శీనానాయక్ అధికారులు, సిబ్బంది చేత స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆలయ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో శానిటేషన్ సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు ఎస్.రమేష్‌బాబు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







ఆసనాలతో ఆరోగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు చేశారు. వివిధ రకాల ఆసనాలతో పాటు ప్రాణాయామం చేస్తున్న చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విద్యార్థులకు భోజనం ప్లేట్లు వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): హరివిల్లు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్లోని విద్యార్థులకు శనివారం భోజనం ప్లేట్లను వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రసిక్ సంఘ్వీ మాట్లాడుతూ ఫౌండేషన్ నిర్వాహకులు గత నాలుగు సంవత్సరాల నుంచి చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. మధ్యాహ్న భోజనానికి వినియోగించే నిమిత్తం దాదాపు 300 స్టీల్ ప్లేట్లు అందజేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.శశికాంత్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేందుకు సరిపడా ప్లేట్లు లేవని ప్రధానోపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నానని చెప్పారు.



భోజనం ప్లేట్లు అందజేస్తున్న డాక్టర్ సంఘ్వీ

వెంటనే తమ ఫౌండేషన్ ద్వారా భోజనం ప్లేట్లు పంపిణీ చేశామని తెలిపారు. పాఠశాల హెచ్ఎం మల్లికార్జునరెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌కుమార్, సహాయ కార్యదర్శి యు కనకారావు, సభ్యులు మానేపల్లి రామకృష్ణ, సాయి అఖిల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

26 నుంచి త్రిశక్తి పీఠంలో వారాహి నవరాత్రులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆషాఢ మాసం పురస్కరించుకుని బస్టాండ్ సమీపంలోని శ్రీకాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో ఈ నెల 26వ తేదీ నుంచి వారాహి నవరాత్రులు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆషాఢ శుద్ధ పాడ్యమి 26వ తేదీ నుంచి శుద్ధ నవమి జూలై 4వ తేదీ వరకు వారాహి నవరాత్రులు పురస్కరించుకుని కాళీమాత అమ్మవారు వారాహిదేవిగా దర్శనమిస్తారని తెలిపారు. తొమ్మిది రోజులపాటు ప్రతి రోజు ఉదయం 9.30 గంటలకు వారాహి హోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా సాగిన కూచిపూడి నృత్యాలు

విజయవాడ కల్చరల్: అయాచితుల కల్చరల్ అండ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో శనివారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు నేత్రపర్వంగా సాగాయి. నాట్యాచారిణి రాఘవేంద్ర నృత్యాలయం నిర్వాహకురాలు బీ నవ్యశ్రీ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. మూషికవాహన, మద్దుగారే యశోద, ఓంకార రూపిణి, బ్రహ్మమొక్కటే, పలుకే బంగారమాయన అంశాలకు చిన్నారులు అంజలి, వర్షిత, హిమశ్రీ, లతిక, లహరిలు నృత్యాలను అభినయించారు. రంగస్థల నటుడు, అయాచితుల కల్చరల్ అండ్ వెల్‌ఫేర్ సంస్థ నిర్వాహకుడు అయాచితుల రామకృష్ణ పర్యవేక్షణలో సాగర్ ఆర్ట్స్ వారి కాలజ్ఞానం నాటిక, భక్తి రంజని కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కళాపోషకుడు మూర్తిరాజు, పట్నాయక్ పాల్గొన్నారు.



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

యోగాతోనే శారీరక, మానసిక ఆరోగ్యం



ఏకేటీపీ స్కూల్‌లో విద్యార్థుల యోగాసనాలు



యోగాంధ్ర అవగాహన ర్యాలీ



ఇందిరా ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో యోగాసనాలు

ఘనంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో చురుగ్గా ఉంటారని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఏకేటీపీ స్కూల్‌లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శర్వాణీమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా వారిలో శారీరక, మానసిక దృఢత్వం వస్తుందన్నారు. అనంతరం ప్రముఖ యోగా గురువు పున్నారావు పర్యవేక్షణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమర్ ఆలీ, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ మామిడి శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సీహెచ్ పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో...

స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ యోగాతో క్రమశిక్షణ, పరిపూర్ణ ఆరోగ్యంతో మనసుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి రోజు యోగా చేయడం వల్ల రోజువారి జీవన విధానంలో వత్తిడిని జయంతి మానసిక ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. అనంతరం పాఠకులు, విద్యార్థులతో కలసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

యోగా జీవితంలో ఒక భాగం కావాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా యోగాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి యోగా విశిష్టతను వివరించారు. అనంతరం కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ డీ యుగంధర్ నేతృత్వంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శైలజ, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఇందిరా ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాసనాలు వేశారు. యోగా చేయాల్సిన ఆవశ్యకతను ఇందిరా ఎన్‌క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు శరత్ వివరించారు.

పాయకాపురం(విజయవాడరూరల్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ జి.సంధ్య మాధూరి మాట్లాడుతూ యోగాతో జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. 62, 63, 64 డివిజన్లలోని మున్సిపల్ హైస్కూల్స్‌లో కూడా యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు.

పలు ప్రభుత్వ కార్యాలయాల్లో..



ఏపీసీపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పీ పుల్లారెడ్డి ఆధ్వర్యాన సర్కిల్ కార్యాలయంలో యోగా దినోత్సవం జరిగింది. ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఆయన యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రాజెక్ట్స్ టీవీఎస్ఎన్ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ తోట శ్రీనివాసరావు, ఈఈ ఉప్పలపాటి హనుమయ్య, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలోనూ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. రామకృష్ణ మిషన్‌కు చెందిన యోగా టీచర్స్ గోపాల్‌రావు, శ్రీదేవి ఆధ్వర్యంలో పాఠకులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులు ఎ. కృష్ణమోహన్ పాల్గొని యోగా దినోత్సవ విశేషాలను వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ దీక్షితులు, కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, ఏడీ భాష, రాష్ట్ర పౌర గ్రంథాలయ సిబ్బంది, పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో యోగా దినోత్సవం

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

విజయవాడ కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన దాతలు కొరపాటి కల్యాణి త్రినాథ్, సుమలత, సీతాదేవి, రాజశేఖర్ దివ్యభారతి, తోట రమేష్, తోట శ్రీలక్ష్మి సహకారంతో శనివారం శ్రీవారి అన్నప్రసాద వితరణ చేశారు. ముందుగా కల్యాణ మండపంలో కొలువైవున్న పద్మావతి శ్రీనివాసులకు అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ స్టాల్‌లో తిరుమలలో శ్రీవారికి పూజలకు ఉపయోగించిన పూలతో తయారు చేసిన వీభూది, సుగంధ ద్రవ్యాలు, అగర్‌బత్తిలను విక్రయించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ అన్నప్రసాద వితరణ సేవలో పాల్గొనేవారు దేవాలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా సింధూ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సీనియర్ గాయని సింధూ పర్యవేక్షణలో గాయకులు రాణి, శ్రేయ, సత్య, ఉదయ్‌కాంత్, శివ, సురేష్, నాని, బెనర్జి, వెంకట్, ప్రసాద్‌లు తెలుగు, హిందీ, చిత్ర గీతాలతో పాటు క్లాసికల్స్, సెమీ క్లాసికల్ గీతాలను ఆలపించారు. సీనియర్ గాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గాయనీ గాయకులు సాధన చేయాలన్నారు. గాయని సింధూ మాట్లాడుతూ సింధూ ఈవెంట్స్ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నూతన గాయనీ గాయకులను వేదికకు పరిచయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.



చిత్ర గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం మహిళా కమిటీ ఎన్నిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం సెంట్రల్ నియోజకవర్గ మహిళా కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రజాకాపునాడు సెంట్రల్ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలుగా ఇస్సంశెట్టి ఉషాజ్యోతి, ప్రధాన కార్యదర్శిగా తిరుమలశెట్టి లక్ష్మీసత్యభార్గవి, ఉపాధ్యక్షురాలుగా మారుబోయిన వినయవాణి, గరికపాటి అన్నపూర్ణ, కార్యదర్శిగా కనుగుల చిన్నమ్మడు, ఇందుర్తి శ్రీలత, ఇప్పిలి రత్నకుమారి, రావులపల్లి అనసూయ, ఇందుర్తి శ్లీతిక, మజ్జి సుభద్ర, తోట సంధ్యారాణి, కనుగుల ప్రసన్న ఎన్నికయ్యారు. నగరంలోని లచస్ ఇన్‌ఫ్రాలో జరిగిన సమావేశంలో ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులంతా ఐక్యంగా ఉండి హక్కులను పరిరక్షించుకుని అభివృద్ధి చెందాలని సూచించారు.



నియామక పత్రం అందజేస్తున్న అంజిబాబు

సంప్రదాయ విలువలను చాటిన ధాన్వి రంగ ప్రవేశం

విజయవాడ కల్చరల్: యువ నర్తకి ఊటుకూరి ధాన్వి కూచిపూడి నృత్య ప్రదర్శన కూచిపూడి సంప్రదాయ విలువలను చాటింది. విఖ్యాత నాట్యాచారిణి శైలజా ప్రసాద్ నృత్య శిక్షణలో శనివారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రదర్శించిన అంశాలు మనోహరంగా సాగాయి. రంగపూజతో ప్రారంభించి గజవదనా బేడువే, మద్దుగారే యశోద, సంప్రదాయ నృత్యం భామాకలాపం, రామదాసు కీర్తన తక్కువేమి మనకు, గోవర్ధన గిరిధారి, కంద దశాయదాక్షి, అంశాలను ప్రదర్శించింది. ఎం. శ్రీనివాస్, శ్రీధరాచార్య, అనిల్‌కుమార్, ఆర్ సుధాకర్‌లు సహకరించారు. నాట్యాచారిణి శైలజా ప్రసాద్ మాట్లాడుతూ సంప్రదాయ నృత్య సంప్రదాయాల పట్ల ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. కూచిపూడి సంప్రదాయ విలువలను పరిరక్షించుకోవాలని సూచించారు. నాట్యాచార్యులు భాగవతుల వెంకటరామ శర్మ, జోస్యుల రామచంద్రమూర్తి మాట్లాడుతూ గురు సంప్రదాయం భారతీయ ఆత్మగా అభివర్ణించారు. అనంతరం నాట్యగురువు శైలజా ప్రసాద్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



నృత్యం ప్రదర్శిస్తున్న ధాన్వి

పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కల్పించాలి

పటమట(విజయవాడతూర్పు): పారిశుద్ధ్య కార్మికులకు జీవిత భద్రత కల్పించాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుదే రాజా అన్నారు. యోగా డే కార్యక్రమం సందర్భంగా శనివారం ఉదయం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పారిశుద్ధ్య విధులు నిర్వహించుచున్న 47వ డివిజన్ కార్మికురాలు ముత్యాల సింహాచలంపై ఎల్ఈడీ స్క్రీన్ పడి గాయాలు పాలై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను యూనియన్ సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్‌తో కలిసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు ఏదైనా ప్రమాదం జరిగి గాయపడిన లేదా చనిపోయిన వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అరకొర సహాయం ఏళ్లు గడుస్తున్నా అందటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చనిపోయిన వారికి రూ.20 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షలు ఘటన జరిగిన నెల రోజుల్లోపే అందించేలాగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యువతకు బ్యాంకింగ్‌పై అవగాహన అవసరం

పటమట(విజయవాడతూర్పు): యువత బ్యాంకింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొసిరెడ్డి వీర్రాజు అన్నారు. పటమట బెంజిసర్కిల్ వద్ద ఉన్న కళాశాల ప్రాంగణంలో ఆర్బీఐ, తెనాలికి చెందిన సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ(ఆర్టిడ్స్) ఆధ్వర్యంలో విద్యార్థులకు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవగాహన వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచంలో మోసాల పట్ల అప్రమత్తత అవసరమని తెలిపారు. అలాగే ప్రభుత్వ పథకాలు, ఖాతాల నిర్వహణ, పొదుపు అలవాట్ల గురించి ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్ డాక్టర్ ఎస్.కలహస్తి, బ్యాంక్ మాజీ మేనేజర్ కేసీహెచ్ కోటేశ్వరరావు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే భవిత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ వంటి అధునాతన సాంకేతిక అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీసీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ బీవీఎస్ఎస్ఎస్ గోపాల్ అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఇండస్ట్రీ ఇంటరాక్షన్ అండ్ కెరీర్ పాత్ వే గైడెన్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ పరిశ్రమల పనితీరు, ఉద్యోగ అవకాశాలు, మార్కెట్ డిమాండ్స్, భవిష్యత్ కెరీర్ అవకాశాల గురించి విలువైన సూచనలు చేశారు. సాఫ్ట్‌వేర్ రంగం నిత్యం ఆధునికీకరణ చెందుతుందని తెలిపారు. కాలంతో వేగంగా పోటీపడినప్పుడే సరికొత్త నైపుణ్యాలు సాధించగలుగుతామన్నారు. సాఫ్ట్‌వేర్ కెరీర్ ప్రతి క్షణం సవాళ్లతో కూడుకుంటుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ వీటీ రాంపవన్, పీజీ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.